
సాక్షి బాపట్ల

సోమవారం । 18 । మార్చి । 2024



కార్తికేయుని సేవలో..

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దేవదాయ ధర్మ దాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 513.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విశేష నాగవల్లీ దళాలతో పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
గుంటూరు	6.24	4.57
చిలకలూరిపేట	6.27	4.57
బాపట్ల	6.24	4.57

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష



గుంటూరు వెస్ట్: ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి స్థానిక టీజేపీఎస్ కళాశాలలో జరిగిన పరీక్షను పరిశీలించారు. ఏర్పాట్లతోపాటు పరీక్ష జరిగే విధానాన్ని కాసేపు గమనించారు. అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షకు ఉదయం హాజరు కావాల్సిన 8785 మందికి గానూ 6254 మంది, మధ్యాహ్నం పరీక్షకు 8714కు గానూ 6325 మంది హాజరయ్యారు. మొత్తం 17499 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 12579 మంది హాజరయ్యారు. 4920 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు.

స్పందన రద్దు: కలెక్టర్

బాపట్ల టౌన్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి స్పందనలో అర్జీలు ఇవ్వడానికి రావద్దని ఆయన సూచించారు.

తాత్కాలికంగా పోలీస్ స్పందన కూడా...

జిల్లాలోని కొరిశపాడు మండలం, పిచికలగుడిపాడు గ్రామ పరిధిలోని 16వ జాతీయ రహదారిపై ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్ ఈనెల 18న జరగనున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

రేపు మెడికల్ గ్రీవెన్స్



గుంటూరు మెడికల్: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె. నివాస్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్య ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నేతలు వేతన సంబంధిత సమస్యలపై తమ అర్జీలను 19న సమర్పించుకోవచ్చన్నారు. వేతన సమస్యలపై ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో సత్తా



పెనమలూరు: సీనియర్ జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన కె.బాలకృష్ణ బంగారు పతకం సాధించారని రాష్ట్ర టీపీబీబీఏ అధ్యక్షుడు స్వామిరమేష్, కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు, తెలిపారు. ఆదివారం వివరాలు తెలుపుతూ పంజాబ్ లూథియానాలో ఈ నెల 16, 17 తేదీల్లో జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలు జరిగాయన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 55 కేజీల విభాగంలో కె.బాలకృష్ణ (రైల్వేస్) బంగారు పతకం సాధించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, తాళ్లూరి అశోక్,సభ్యులు అభినందనలు తెలిపారు.

గరికపాడు చెక్‌పోస్టు వద్ద రూ. 40 లక్షలు స్వాధీనం

జగ్గయ్యపేట :గరికపాడు చెక్‌పోస్టు వద్ద తెలంగాణ నుంచి తీసుకొస్తున్న రూ. 40 లక్షలను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు వస్తున్న ప్రైవేట్ బస్సును తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు బ్యాగులో నగదు తీసుకొస్తున్నట్లు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవటంతో చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లోని రేఖ కార్పొరేషన్ సంస్థకు చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు బాక్సుల్లో నగదును రాజమండ్రికి తరలిస్తున్నట్లు తెలిసిందని సమాచారం.

సుగంధ పరిమళాలు



దున్నిన పసుపు చేలో దుంపలు సేకరణ

పసుపు బంగారమయే..

- ఆశాజనకం దిగుబడులు
- అత్యధిక ధర క్వింటా రూ.16 వేలు
- పసుపు రైతుల దిల్‌ఖుష్..

తెనాలి: పసుపు శుభప్రదం.. పచ్చని తోరణం నుంచి ఇంటి గడప వరకు.. పెండ్లి తంతులోనూ ప్రధాన భూమిక.. కాళ్ల పారాణి.. తలంబ్రాల నుంచి మన ఆరోగ్య రక్షణ కవచంగానూ వినియోగించడం మన సంప్రదాయాల్లో భాగమైంది. కాని అప్పట్లో పాలకుల నిర్లక్ష్యం పసుపు సాగు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో అత్యధిక ధర అందుకుంటున్నారు.

సాగు ఇలా..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పసుపు సాగులో తెనాలి డివిజన్‌దే అగ్రస్థానం. 2021-22లో 8,166 ఎకరాల్లో పసుపు సాగుచేశారు. 2020-21తో పోల్చితే ఈ విస్తీర్ణం 2,479 ఎకరాలు తగ్గింది. ఆ ఏడాది 10,645 ఎకరాల్లో పసుపు పండించగా, అంతకుముందు ఈ విస్తీర్ణం 11,277 ఎకరాలుగా ఉంది. 2018-19లో 12,057 ఎకరాల్లో పసుపు సాగయింది. ఉమ్మడి జిల్లాలో పసుపు పంట విస్తీర్ణం క్రమేపీ తగ్గుతుందని చెప్పేందుకు ఈ గణాంకాలే నిదర్శనం. పెట్టుబడి ఖర్చులు పెరుగుతూ దిగుబడులు తగ్గిపోవడం, మార్కెట్ ధరలు సరిగా లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం.

జిల్లాల పునర్విభజనంతో తెనాలి డివిజనులోని అత్యధిక మండలాలు బాపట్ల జిల్లా పరిధిలోకి వెళ్లాయి. విభజిత గుంటూరు జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,337 ఎకరాలు. 2022-23 సీజనుకు కేవలం 3,864 ఎకరాల్లోనే రైతులు పసుపు సాగుచేశారు. ఇందులో తెనాలి నియోజకవర్గంలోనే అత్యధికంగా 2,257 ఎకరాల్లో పసుపు వేశారు. 2021-22తో పోలిస్తే జిల్లాలో వెయ్యికి పైగా ఎకరాల్లో పంట విస్తీర్ణం తగ్గింది. మూడేళ్ల క్రితం అధిక వర్షాలకు దుంపకుళ్లుతో పంట నష్టపోయిన ఉమ్మడి జిల్లాలోని పసుపు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బీమా పరిహారాన్ని అందించి ఆదుకుంది. 2022-23లో పసుపు కనీస విస్తీర్ణం 5 వేల ఎకరాలకన్నా తక్కువగా 3,864 ఎకరాల్లోనే సాగయింది. ఆ ఏడాది కూడా మార్కెట్లో ధరలు తగ్గడంతో ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి వచ్చింది.

విత్తనం ఎంపికలోనూ మిన్నగా..

2023-24 ఖరీఫ్ సీజనులో విభజిత గుంటూరు జిల్లాలో నాలుగు వేల ఎకరాల్లో పసుపు సాగును చేపట్టారు. ఏటా కడప, మైదుకూరు, సేలం, టేకూరుపేట రకాలు, కేరళకు చెందిన ప్రగతి రకం పసుపు విత్తనాలను విత్తేవారు. గత ఖరీఫ్‌లో 60 శాతం రైతులు సేలం రకం విత్తనాన్నే ఆదరించారు. దిగుబడి గ్యారెంటీ, దాదాపు 4-5 శాతం కుర్కుమిన్ ఉండటంతో ఈ రకాన్నే ఎక్కువమంది సాగు చేశారు. వర్షాభావం, సీజనులో వచ్చిన తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో అక్కడక్కడా దుంపకుళ్లు వచ్చినా, ఏపుగా ఎదిగిన పైరును చూసుకుని రైతులకు దిగుబడులపై భరోసా వచ్చింది. ప్రస్తుతం దుంప పక్వానికి రావడంతో పసుపు చేలు దున్నుతున్నారు. ఎకరాకు 30-40 క్వింటాళ్ల వరకు ఎండు పసుపు వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. ఎకరా పసుపు సాగుకు రూ.2.25 లక్షల వ్యయం అవుతోంది.

కొన్నేళ్లుగా ఒడిదుడుకులు...

కొన్నేళ్లుగా పసుపు సాగు రైతులు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఏటికేడాది దిగుబడులు తగ్గుతున్నా, మార్కెట్ ధరలు గిట్టుబాటు కాకున్నా, రాష్ట్రప్రభుత్వమే రంగంలోకి దిగి మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటం కొంత ఊరటనిస్తోంది. అయినా కొందరు రైతులు పంటమార్పిడికి వెళుతున్నారు. సంప్రదాయంగా పసుపును నమ్ముకున్న రైతులు సాగును కొనసాగిస్తూ వస్తున్నారు.

ధరలపై ఆశలు..

ఇంత భారీ పెట్టుబడులు పెడుతున్న రైతులకు మార్కెట్ ధరలు ఆశాజనకంగా లేకపోవటం తరచుగా జరుగుతోంది. ప్రస్తుతం పంట చేతికి వస్తున్న సమయంలో మార్కెట్‌లో కొద్దిరోజులుగా పసుపుకు మంచి డిమాండ్ ఏర్పడింది. విస్తీర్ణం తగ్గటం, ఎగుమతులు పెరగటంతో క్వింటాలు పసుపు ధర రూ.10 వేల నుంచి పెరుగుతూ వచ్చింది. కొద్దిరోజుల క్రితం రూ.13 వేలకు చేరింది. మళ్లీ ఇప్పుడు క్వింటాలు రూ.16 వేలకు పైగా అమ్మగలుగుతున్నారు. ఈ పరిణామం రైతులను ఆనందపరుస్తోంది. పచ్చి పసుపు ఉడకబెట్టి, ఎండాక విక్రయించే నాటికి ఇదే ధర ఉన్నట్టయితే లాభసాటి కాగలదని రైతులు భావిస్తున్నారు.

మంచి దిగుబడి వచ్చింది...



ఈసారి పసుపు దిగుబడులు బాగున్నాయి. ప్రస్తుతం దున్నిన అర ఎకరంలో 20 క్వింటాళ్ల ఎండు పసుపు వస్తుందని భావిస్తున్నాం. మరో ఎకరంన్నరలోనూ పంట బాగుంది. మార్కెట్‌లో కొన్నేళ్లుగా ధరలు తక్కువగా ఉంటున్నాయి. ప్రస్తుతం రేటు బాగుంది. ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాం.

– బీహెచ్ నాగబసివిరెడ్డి, రైతు, కొల్లిపర

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- 30వ తేదీ వరకు నిర్వహణ
- జిల్లాలో 108 కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న రెగ్యులర్ విద్యార్థులు 16,906
- సప్లిమెంటరీ విద్యార్థులు 2,004
- 972 మంది ఇన్విజిలేటర్ల నియామకం
- సమస్యాత్మక సెంటర్లుగా ఎనిమిది గుర్తింపు
- సీసీ కెమెరాలతో నిఘా



పరీక్ష కేంద్రాల్లో బల్లలపై హాల్ టికెట్ నంబర్లు రాస్తున్న ఇన్విజిలేటర్లు

బాపట్ల టౌన్: జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమవుతున్న పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు రాయనున్న నేపథ్యంలో వారి సందేహాల్ని నివృత్తి చేసేందుకు ఇన్విజిలేటర్లను నియమించారు. ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 18,910 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో 16,906 మంది రెగ్యులర్, 2004 మంది సప్లిమెంటరీ విద్యార్థులున్నారు. వీరంతా పరీక్షల్ని రాసేందుకు జిల్లాలో 108 కేంద్రాల్ని సిద్ధం చేశారు. హాల్ టికెట్లను ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఇప్పటికే విద్యార్థులకు అందజేశాయి. పరీక్షల పర్యవేక్షణకు 108 డిపార్ట్‌మెంటు అధికారులు, 13 మంది అడిషనల్ డిపార్ట్‌మెంటు అధికారులు, 972 మంది ఇన్విజిలేటర్లు, 6 ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాలు, 45 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను అధికారులు నియమించారు. జిల్లాలో ఎనిమిది సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ : ఎస్పీ

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలోని 108 కేంద్రాల వద్ద ఇద్దరు సిబ్బంది చొప్పున నియమించినట్లు చెప్పారు. వీళ్లతో పాటు అన్ని సెంటర్లలో ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా పర్యవేక్షణకు ఎస్ఐ స్థాయి అధికారిని నియమించామన్నారు. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు కేంద్రానికి 100 మీటర్ల దూరంలో విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు ఎవరూ ఉండరాదని సూచించారు. ఆయా ప్రాంతాల్లో జనాలు గుమికూడినా, కేకలు వేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇన్విజిలేటర్లు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



పరీక్షల నిర్వహణలో ఇన్విజిలేటర్లు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి కె. నారాయణరావు తెలిపారు. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. హాజరయ్యే ప్రతి విద్యార్థి హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కనీసం పావుగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. ఇన్విజిలేటర్లు, విద్యార్థులతో పాటు పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన ప్యాడ్లు అనుమతించమని తెలిపారు. విద్యార్థులు పాఠశాల పేరుతో ఉన్న ఐడీ కార్డులు, యూనిఫామ్ ధరించరాదని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఫొటోస్టాట్, నెట్ సెంటర్లు తెరిచి ఉంచరాదని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తెరిస్తే షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు.

దుర్గమ్మ సన్నిధికి రికార్డు స్థాయిలో భక్తులు

- టికెట్ల విక్రయం ద్వారా భారీ ఆదాయం
- భక్తులతో కిటకిటలాడిన క్యూలైన్లు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):నూతన వధూవరులు, పరీక్షలు పూర్తయిన ఇంటర్ విద్యార్థులు, సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యే పదో తరగతి విద్యార్థులతో పాటు సాధారణ భక్తులు తమ ఇష్టదైవమైన దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. రికార్డు స్థాయిలో భక్తులు శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో దర్శన టికెట్ల విక్రయాలు అత్యధికంగా జరిగి దేవస్థానానికి భారీ ఆదాయం సమకూరింది. తెల్లవారుజాము నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థాన ఘాట్‌రోడ్డుతో పాటు మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా భక్తులు కొండపైకి చేరుకుని దుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ క్యూలైన్లు కిటకిటలాడాయి. రద్దీ నేపథ్యంలో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా, అనధికార వీఐపీల పేరిట వచ్చే భక్తులను నియంత్రించారు. స్కానింగ్ పాయింట్ వద్ద సూపరింటెండెంట్ స్థాయి అధికారిని నియమించి టికెట్లు ఉన్న వారిని మాత్రమే క్యూలైన్‌లోకి అనుమతించారు.

భారీగా ఆదాయం...

దీంతో స్కానింగ్ పాయింట్ టికెట్ కౌంటర్ ఉదయం షిఫ్టులో రూ. 4 లక్షల మేర టికెట్ల విక్రయించింది. మరో వైపున మైక్ ప్రచార కేంద్రం వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన టికెట్ల కౌంటర్‌లో రూ. 2.30 లక్షల టికెట్లను విక్రయించింది. సమాచార కేంద్రం టికెట్ల కౌంటర్ మరో రూ. లక్ష మేర టికెట్లను విక్రయించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. మొత్తంగా ఆదివారం ఒక్క రోజే సుమారు రూ.17 లక్షల మేర ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. రద్దీతో భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా ఆలయ ఈవో కెఎస్.రామారావు ఎప్పటికప్పుడు సిబ్బందికి సూచనలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ఏఈవో ఎన్. రమేష్‌బాబు క్యూలైన్లు త్వరత్వరగా ముందుకు జరిగేలా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ కొనసాగింది. ఉదయం ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవలతో పాటు ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద నిర్వహించిన సూర్యోపాసన సేవలోనూ ఉభయదాతలు పాల్గొన్నారు. సేవలలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేకంగా రూ. 300 క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం కల్పించారు. మరో వైపున సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు, ఉభయదాతలు విశేషంగా పాల్గొని, ఉత్సవ మూర్తులతో కలిసి ఆలయం చుట్టూ మూడు పర్యాయాలు ప్రదక్షిణలు చేశారు.

విషాదంగా మారిన వేడుక యాత్ర



తీవ్రంగా గాయపడిన బాధితులు



ఘటనా స్థలంలో బోల్తా కొట్టిన బస్సు

- కోటప్పకొండ వెళుతున్న బస్సు బోల్తా
- ఏడుగురికి తీవ్రంగా, 20 మందికి స్వల్ప గాయాలు
- తీవ్రంగా గాయడిన వారు ఒంగోలు జీజీహెచ్‌కు తరలింపు

అద్దంకి: పుట్టెంట్రుకల వేడుకకు వెళ్తున్న బృందం బస్సు అదుపుతప్పి సైడులో బోల్తా కొట్టడంతో 27 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని అద్దంకి-దర్శి రహదారిలోని తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాల సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. దర్శి మండలంలోని కొర్లమడుగు గ్రామానికి చెందిన కోట్ల రాజశేఖర్‌రెడ్డి కుమార్తె పుట్టు వెంట్రుకలను పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ వద్ద తీయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో ఓ పాఠశాల బస్సులో కుటుంబంతోపాటు 40 మంది ఉదయాన్నే బయలు దేరారు. అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్దకు రాగానే కమాన్ కట్ట బోల్తు పోవడంతో స్టీరింగ్ కంట్రోల్ కాక సైడులోకి బోల్తా కొట్టింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బస్సు వెనుక, ముందు వైపు అద్దాలను పగులగొట్టి తీవ్రంగా గాయపడిన వారిని బయటకు తీసుకువచ్చారు. అనంతరం వారిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నాగరాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులను వివిధ వాహనాల్లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్ర గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఇందులో 27 మందికి స్వల్పంగా, ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

తీవ్రంగా గాయపడిన వారు..

తీవ్రగా గాయపడిన వారిలో యర్రం ధనమ్మ, నాగమని, కోటయ్య, శానం నారాయణరెడ్డి, కోటిరెడ్డి, అంకమ్మ ఉన్నారు. శాంతి, కోటిరెడ్డి, పావని, వెంకాయమ్మ, సుబ్బారావు, ఆదిలక్ష్మి, సాయిరోషన్, అనసూర్యమ్మ, తన్విక, రమణారెడ్డి, రాణి, కీర్తన, చంద్రమౌళి, సాయిశ్రీ, హర్ష, హేమేష్, బి. సుబ్బారెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిలో తొమ్మిది మంది పిల్లలున్నారు. సైడు లోతు తక్కువగా ఉండడంతో బస్సు ఒక్క పల్టీ మాత్రమే కొట్టడం వల్ల ప్రమాదం తప్పింది. తీవ్రంగా గాయపడిన వారికి కాళ్లు, నడుము, చేతులు విరిగిపోయాయి. మిగిలిన వారు చిన్న చిన్న గాయాలతో బతికి బయటపడ్డారు.



చికిత్స పొందుతున్న మహిళలు



గాయపడిన చిన్నారులు

నృసింహుని కల్యాణానికి దేవతలకు ఆహ్వానం

ధ్వజారోహణంతో గరుత్మంతుని ప్రతిష్ట



ధ్వజారోహణంలో గరుత్మంతుడు



గరుడ ముద్దలు అందుకుంటున్న భక్తులు

మంగళగిరి: స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో అతి ప్రధానమైన ఘట్టం ధ్వజారోహణం, రెండో రోజు ఆదివారం రాత్రి 8 గంటలకు రుత్విగ్వరణ అంకురారోపణాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవానికి భక్తజనులను, దేవతలను ఆహ్వానానికి భక్తాగ్రేసరుడైన గరుత్మంతుని ధ్వజంపై ప్రతిష్ఠించారు. అష్టనాగాధిపతి అయిన గరుత్మంతునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దలు అను పేరుతో సంతానం లేని దంపతులు ప్రసాదంగా స్వీకరించిన ఫలితం కలుగుతుందని భక్తుల నమ్మకం. వేలాది సంఖ్యలో భక్తులు స్వామి వారిని ధ్వజారోహణం తిలకించి గరుడుముద్దలు స్వీకరించి ఆశీస్సులు పొందారు. వేడుకలను ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించగా, కైంకర్యపరులుగా మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ సభ్యులు వ్యవహరించారు. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు హనుమంతవాహనంపై..

నృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజు సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీవారు హనుమంత వాహనంపై గ్రామోత్సవంలో దర్శనమివ్వనున్నారు.

25 నుంచి తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు

ఐదు రోజుల ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు: భక్తులతో విశేష పూజలందుకుంటున్న పెనుగంచిప్రోలు తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాలు మార్చి 25 నుంచి 29వరకు వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం ఆలయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. తిరునాళ్ల మహోత్సవాలు జరిగే ఐదు రోజులు, ఒక్కో రోజు ఒక్కో ఉత్సవం కనుల పండువగా జరగనుంది. ఉత్సవాల్లో అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు గ్రామం నుంచి పసుపు-కుంకుమల బండ్లు రాక ప్రధాన ఘట్టంగా నిలవనుంది. తిరునాళ్లకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వస్తారు.

ఇవీ ఏర్పాట్లు..

మునేరులో జల్లు స్నానాలు, పలు చోట్ల భక్తుల సౌకర్యార్థం చేతి పంపులు, శుద్ధి చేసిన తాగు నీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు వసతి కోసం పలుచోట్ల షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు.



- చిన్న తిరునాళ్లలో మొదటి రోజు మార్చి 25న ఉదయం 6.03 గంటలకు అఖండజ్యోతి స్థాపనతో ఉత్సవాలు మొదలవుతాయి. వేలాదిగా భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో మొక్కులు తీర్చుకుంటారు. నిత్య కల్యాణ మూర్తులకు అభిషేకం ఉంటాయి.
- తిరునాళ్లలో రెండో రోజు మార్చి 26న రాత్రి 6.26 గంటలకు ఉత్సవమూర్తులను రథంపై ఉంచి గ్రామంలో రథోత్సవం (గ్రామోత్సవం) కనుల పండువగా నిర్వహిస్తారు.
- మూడో రోజు మార్చి 27 రాత్రి 8.34 గంటలకు దివ్య ప్రభోత్సవం వైభవంగా జరగనుంది. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న ఈ ఉత్సవంలో సుమారు 90 అడుగుల దివ్యప్రభపై ఉత్సవ మూర్తులను ఉంచి ప్రభను ఎడ్లు లాగుతూ ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయిస్తారు.
- చిన్న తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పుట్టింటి పసుపు-కుంకుమ బండ్లు మార్చి 28న అనిగండ్లపాడు గ్రామం నుంచి సాయంత్రం 4.12గంటలకు ప్రారంభం కానున్నాయి. అమ్మవారి పుట్టింటి వంశీకులు కొల్లా శ్రీనివాసరావు ఇంటి నుంచి ఏటా పసుపు కుంకుమలు బండ్లపై తీసుకు రావటం ఆనవాయితీగా వస్తోంది. గ్రామానికి చెందిన వారు వందల బండ్లతో పసుపు-కుంకుమ బండి వెంట పెనుగంచిప్రోలు ఆలయానికి చేరుకుంటారు.
- ఐదోరోజు మార్చి 29న భక్తుల బోనాల సమర్పణతో చిన్న తిరునాళ్ల ఉత్సవాలు ముగుస్తాయి.

క్లుప్తంగా

దైవాన్ని భక్తిశ్రద్ధలతో పూజించాలి

త్రిదండి చినజీయర్ స్వామి



భక్తులకు సందేశమిస్తున్న చినజీయర్ స్వామి

నగరం: దైవాన్ని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సుఖ సంతోషాలతో జీవించవచ్చని త్రిదండి చినజీయర్ స్వామి తెలిపారు. మండలంలోని పెద్ద వరంలో గల శ్రీరంగనాయస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఎక్కడ దేవుడు పూజింపబడ తాడో ఈ ప్రాంతంతో దైవానుగ్రహంతో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. ఆధ్యాతిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. ఆలయ జీర్ణోద్ధరణకు దేవదాయ శాఖ, ధర్మకర్తలు చర్యలు చేపట్టాలని చెప్పారు. తొలుత వేదపండితులు చినజీయర్ స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేదాల అంతర్వేదిస్వామి,ఆలయ ప్రధాన అర్చకులు వెంకట లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త



ఇస్తేరి మృతదేహం

యడవూరు(వేమూరు): అక్రమ సంబంధం మహిళ ప్రాణం మీదకు తెచ్చింది. భర్త ఆగ్రహం చెంది తన్నడంతో గోడకు తల తగిలి ప్రాణం కోల్పోయింది. ఈ ఘటన అమర్తలూరు మండలంలోని యడవూరు దళితవాడలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు యడవూరు గ్రామానికి చెందిన మట్టకొయ్య ఇస్తేరి(35) అదే గ్రామంలోని మరొక వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్త యోబుకు తెలిసి, ఆమెను పలుసార్లు హెచ్చరించాడు. అయినా మార్పు రాకపోవడంతో శనివారం అర్ధరాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో యోబు భార్యను కాలుతో తన్నాడు. ఆమె తల గోడకు తగలడంతో తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడ మృతి చెందినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ ఆదివారం తెలిపారు. నిందితుడు పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడని చెప్పారు. హత్యపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఇస్తేరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు పేర్కొన్నారు.

వైవీపై కృష్ణచైతన్య వ్యాఖ్యలు అర్థరహితం

వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డిపై అద్దంకి వైఎస్సార్ సీపీ మాజీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య వ్యాఖ్యలు అర్థరహితమని.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని అద్దంకి వైఎస్సార్ సీపీ నాయకుడు పానెం నరసింహారెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వై.వి. సుబ్బారెడ్డిపై అనుచిత వ్యాఖ్యల్ని ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ సుబ్బారెడ్డి వల్లే ఈ ప్రాంతానికి కొత్త అయిన హనిమిరెడ్డికి నియోజకవర్గంలో ఎంతో ప్రజాదరణ లభించిందని తెలిపారు. ఎప్పటికీ ఆయన తమకు దైవంతో సమానమని తెలిపారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ మురహరి యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో చైతన్య చేసిన దురాగతాల వల్లే పార్టీ ఇన్‌చార్జి పదవి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తప్పించారని గుర్తు చేశారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కృష్ణచైతన్య నాలుగేళ్లు అక్రమ సంపాదనకు పాల్పడ్డారని ఆరోపించారు. నియోజకవర్గ రాజకీయాలపై జోక్యం చేసుకోని సుబ్బారెడ్డిని దూషించడం సరికాదని తెలిపారు. సర్వేల ఆధారంగానే ఇన్‌చార్జి పదవి కోల్పోయావని తెలుసుకోవాలని, ఇందులో సుబ్బారెడ్డి ప్రవేయం లేదని వివరించారు. చిన్న వ్యాపారస్తులను మొదలుకొని ఎవరిని వదలకుండా లంచాలు దండుకున్న సంగతి మరిచిపోయావా ? అని ప్రశ్నించారు.

ఓకే సామాజిక వర్గానికి కొమ్ముకాశారు

ఎస్సీ సెల్ నాయకుడు జజ్జర ఆనందరావు మట్లాడుతూ పార్టీలో తన సామాజికవర్గ ప్రాబల్యాన్ని పెంచుకుని మొదటి నుంచి అండగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను కృష్ణచైతన్య అణగదొక్కారని విమర్శించారు. నాలుగు సంవత్సరాలుగా పార్టీని నియోజకవర్గంలో భ్రష్టు పట్టించింది నీవు కాదా? అని ప్రశ్నించారు. ఇక మీదట వై.వి. సుబ్బారెడ్డిని దూషిస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. పంగులూరు వైఎస్సార్ సీపీ నాయకుడు స్వయంపు హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి పనికీ లంచాల్ని తీసుకుని పార్టీకి చెడ్డపేరు తెచ్చిన కృష్ణచైతన్య అతని తండ్రి గరటయ్యలు ప్రజల్ని దోచుకున్నారని విమర్శించారు. నాయకులు జువ్వి రాము, పులిగం కోటిరెడ్డి, బి.వి. కృష్ణారెడ్డి, కోట శ్రీనివాసకుమార్, చందోలు రాజ్‌కుమార్, గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చైతన్యకు వై.వి. సుబ్బారెడ్డి గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాలను కలుపుకు పోయే సమర్థమైన నాయకుడు పానెం చినహనిమిరెడ్డిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి పంపారని తెలిపారు. ప్రజల్లో హనిమిరెడ్డికి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయని తెలిపారు. హనిమిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. టీడీపీలో చేరి కృష్ణచైతన్య, అతని తండ్రి గరటయ్యలు రాజకీయ జీవితాన్ని సమాధి చేసుకున్నారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని వై.వీపై వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని హితవు పలికారు. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే అద్దంకిలో తిరగనీయమని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో అన్ని రంగాల్లో రాణింపు

చీరాల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్



క్రికెట్ ఆడుతూ ఉత్సాహపరుస్తున్న వెంకటేష్

చీరాల: యువత చదువుతో పాటు క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వాలని.. క్రీడాస్ఫూర్తి కలిగి ఉండటం వల్ల అన్ని రంగాల్లో రాణించవచ్చని చీరాల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని దండుబాట రోడ్డులోని జాలమ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన జై శ్రీరామ్ రెడ్ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తెలిపారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఒక ఓటమిని విజయానికి తొలిమెట్టుగా చేసుకుని రాణించాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కాసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. క్రీడా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సహకారం, ఆడుదాం ఆంధ్రా పోటీల గురించి క్రీడాకారులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జైసన్‌బాబు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సళ్లూరి అనీల్, కె.ప్రసాద్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

పులుల సంచారంపై అటవీ సిబ్బందికి అవగాహన



హాజరైన సిబ్బందితో జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు

నరసరావుపేట రూరల్: జిల్లాలోని అటవీ ప్రాంతంలో పులుల సంచారం ఉన్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు తెలిపారు. పులుల సంచారాన్ని తెలుసుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కోటప్పకొండలోని అటవీ పర్యాటక కేంద్రంలో ఆదివారం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాగార్జునసాగర్ టైగర్ ఫారెస్ట్ సిబ్బంది ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరై పులుల సంచారాన్ని తెలుసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీ సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలోని మాచర్ల, వినుకొండ, బొల్లాపల్లి, లోయపల్లి అటవీ ప్రాంతాల్లో పులుల సంచారం ఉన్నట్టు గుర్తించడం జరిగిందన్నారు. వీటి వివరాలు తెలుసుకునేందుకు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పులుల సంచారం ఉన్న ప్రాంతంలో వాటి జాడ తెలుసుకునేందుకు వీలుగా ఫోటోలను తీసేందుకు 27 కెమెరాలు సిద్ధం చేసినట్టు చెప్పారు. పులుల పాద ముద్రలను సేకరించేందుకు ప్రెషర్ ఇంప్రెసివ్ పాడ్స్‌ను పలు చోట్ల ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వినుకొండ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

గెలిచే సత్తా లేకనే కూటమి పాట

- చంద్రబాబును రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరు
- ఎన్ని పార్టీలు కలిసినా జగనన్న చేతిలో భంగపాటు తప్పదు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 35వ డివిజన్ నుంచి 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక
- పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి రోశయ్య, పార్టీ నేతలు



పార్టీలో చేరిన వారితో మంత్రి రజని, ఎమ్మెల్యే రోశయ్య

పట్నంబజారు: సొంతంగా గెలిచే సత్తా లేకనే పొత్తుల కోసం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వెంపర్లాడుతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. స్థానిక 35వ డివిజన్ జూట్ మిల్లు సమీపంలో శనివారం 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి మంత్రి రజిని, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి రజిని మాట్లాడారు. ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా వైఎస్సార్ సీపీ ప్రభంజనానికి ఎదురు నిలిచే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. వచ్చే ఎన్నికల్లో జనం తీర్పు సునామీలా ఉంటుందని, అందులో ప్రతిపక్ష పార్టీలన్నీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. దీర్ఘకాలం పాటు ముఖ్యమంత్రిగా పనిచేసినా ప్రజలకు ఏమీ చేయలేని అసమర్థుడు చంద్రబాబు అని మండిపడ్డారు. కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్ ఒక స్పష్టమైన విధానం లేకుండా రాజకీయ ప్రయాణం చేస్తున్నారని విమర్శించారు. ఆయన చంద్రబాబునాయుడి ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారనే విషయం గ్రహించిన అభిమానులు తట్టుకోలేకపోతున్నారన్నారు. అందుకే వారందరూ వైఎస్సార్ సీపీలో చేరేందుకు అధిక సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారన్నారు. ముస్ముందు ఈ చేరికలు మరింతగా ఉంటాయని తెలిపారు. చంద్రబాబునాయుడి కుట్రల ఫలితంగానే జనసేన పార్టీ ఖాళీ అయ్యే దుస్థితి నెలకొందన్నారు.

జనసేన నుంచి చేరికలు

జనసేన పార్టీ నుంచి షేక్ షబ్బీర్, షేక్ జిలానీ, షేక్ హుస్సేన్, జమీల్యా, బి.మణికంఠ, బి.కృష్ణ, హెచ్.మహేష్, కె.సునీల్, పి.సుందరరావు, పీటర్ పాల్, పి.నాగరాజు, బూసా మణి, కె.సాల్మన్ పి.షణ్ముగం, బి.శ్రీనివాసరావు, దేవరపల్లి రోషన్ తదితరులు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి టీఎల్‌వీ ఆంజనేయులు, జేసీఎస్ కన్వీనర్ ఇన్నారెడ్డి, బూత్ కన్వీనర్లు కరిముల్లా, శేషాద్రి అంజినాయుడు, జె.దినేష్, జి.దిలీప్ పాల్గొన్నారు.

మంగళగిరిలో టీడీపీకి బిగ్ షాక్

- టీడీపీని వీడిన యువ నాయకుడు చావలి మురళీకృష్ణ
- భారీ ర్యాలీగా 200 కుటుంబాలతో వైఎస్సార్ సీపీలో చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఆర్కే, మురుగుడు, లావణ్య



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, లావణ్య



భారీ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ యువ నాయకుడు చావలి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో రెండు వందలకు పైగా కుటుంబాలు చేరాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. తొలుత చావలి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆటో నగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం నుంచి యర్రబాలెం వరకు యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యర్రబాలెం మైదానంలో నిర్వహించిన సభలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇక టీడీపీకి భవిష్యత్తు లేదన్నారు. బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీలో వారికి ప్రాధాన్యం లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ టీడీపీలో బీసీలకు ప్రాధాన్యం లేదన్నారు. ఒకే సామాజిక వర్గం పెత్తనంతోనే విసిగి, ఇక భరించలేక ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. చరిత్రలో ఏ నాయకుడూ చెప్పని విధంగా.. 'మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే ఓటు వేయండి' అని సీఎం జగన్ చెప్పారంటే.. తన పరిపాలనపై ఆయనకు ఎంత నమ్మకం ఉందో చూడాలని కోరారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్య మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా చట్ట సభల్లో మహిళలకు పెద్ద ఎత్తున అవకాశం కల్పించారన్నారు. బీసీ మహిళ అయిన తనకు మంగళగిరి టికెట్ కేటాయించారని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తన ప్రచారానికి ప్రజల ఆదరణ అపూర్వంగా ఉందని, తప్పనిసరిగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల జెడ్పీటీసీ మేకతోటి అరుణ, మాజీ జెడ్పీటీసీ బళ్ళా శ్రీనివాసబాబు, పార్టీ నాయకులు దాసరి వీరయ్య, గుండాల శ్రీనివాసరావు, నాగయ్య, తాతారావు, చిన్నారి పాల్గొన్నారు.


వ్యాధుల నిర్ధారణలో పరమాణు జన్యుశాస్త్రం కీలకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ టీటీకే రెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలోని జింకానా ఆడిటోరియంలో ఆదివారం వైద్య కళాశాల పాథాలజీ విభాగం మాలిక్యులర్ జెనెటిక్స్(పరమాణు జన్యుశాస్త్రం)పై నిరంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) జరిగింది. ముఖ్య అతిథిగా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీటీకే రెడ్డి పాల్గొని, మాట్లాడారు. అరుదైన వ్యాధుల నిర్ధారణలో మాలిక్యులర్ జెనెటిక్స్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యాధుల నిర్ధారణలో వచ్చిన అత్యాధునిక వైద్య పద్ధతులు వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పీజీ పాథాలజీ కోర్సు అనంతరం సూపర్ స్పెషాలిటీ కోర్సు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనేక వైద్య కళాశాలల్లో డీఎం కోర్సులు ఉన్నాయని, గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆ కోర్సులు ప్రవేశపెట్టే విధంగా ప్రయత్నం చేయాలని సూచించారు. దీంతో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు, నూతన స్పెషాలిటీ డిగ్రీలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీఎఫ్‌డీ అధ్యక్షుడు డాక్టర్ అశ్విన్ దలాల్, నిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షగున్ అగర్వాల్, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ సి.అపర్ణ, ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాద్ ఉమా, టెక్నికల్ ఆఫీసర్లు యాంజెలీనా, వసంతరాణి, డాక్టర్ హరినాథ్, పలు వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ ముస్లిం కార్యకర్తలు



వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం టీడీపీ కార్యకర్తల కుటుంబీకులతో ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: స్థానిక ముత్యాలమ్మ గుళ్ల సెంటర్‌లో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో 25 కుటుంబాల ముస్లిం టీడీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ముస్లిం సోదరులకు తగిన ప్రాధాన్యతనిస్తూ వారి అభివృద్ధికి ఎంత గానో కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహనరెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అమరావతి గ్రామంలో 198 మంది ముస్లిం అక్క చెల్లెమ్మలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు అందించామన్నారు. నియోజకవర్గంలో 500 కంటే ఎక్కువ ముస్లిం జనాభా ఉన్న గ్రామాల్లో షాదీఖానాలు నిర్మించి ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో మరో 16 షాదీఖానాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. పేదల పక్షాన నిలబడిన జగనన్నను ఓడించేందుకు కుట్ర పన్నుతున్న టీడీపీ, జనసేన, బీజేపీల అనైతిక పొత్తులను ముస్లిం సోదరులు తిప్పికొట్టాలన్నారు. పార్టీ అభివృద్ధికి పాటు బడే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ కార్యకర్తలు మహబూబ్‌జానీ, మహ్మద్‌షా, బషీర్, షేక్ జైన్‌బీ, రేష్మా, ముబీనా, మస్తాన్‌బీ, షేక్ మౌలాబీ, షేక్ ఆశా, సలీమా, షేక్ మహబూబ్‌సుబానీ, జెల్సీ, నాగుల్‌జానీ, నాగుల్‌మీరా, జిలానీ, ముమ్మసాతో పాటు 25 కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకురాలు నంబూరు వసంత కుమారి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమం తరావు, పార్టీ నాయకులు నంబూరు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపాలెంలో క్రీడా పండగ

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెం గ్రామం బాస్కెట్ బాల్ కోర్టు జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికకు చక్కని వేదికగా మారింది. గ్రామంలో ఇటీవలే అత్యాధునిక వసతులతో కూడిన సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టు నిర్మించారు. ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి జూనియర్ బాలురు, బాలికల బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ బాస్కెట్ బాల్ అధ్యక్షురాలు మారెళ్ల రేవతి మీడియాతో మాట్లాడారు. సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టు రాష్ట్రస్థాయి పోటీలకు అనుకూలంగా ఉందన్నారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జూనియర్ బాలురు, బాలికల విభాగాలకు సంబంధించి వేర్వేరుగా 20మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. ఎంపికైన 40 మందికి నెల రోజుల పాటు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చి, వారిలో అంతిమంగా ఒక్కో విభాగం నుంచి 12 మందితో కూడిన ఫైనల్ జట్లను ఎంపిక చేయడం జరుగుతుందని వివరించారు. అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జి.ఆంజనేయులు, సీనియర్ బాస్కెట్ బాల్ ప్లేయర్ కె.శ్రీనివాస మూర్తి, కోచ్ సుకన్య భాగస్వామ్యం అవగా అనిల్, వెంకటకృష్ణ అంపైర్లుగా వ్యవహరించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

నకరికల్లు: పాత కక్షల నేపథ్యంలో రౌడీషీటర్‌ను ఐదుగురు కలసి హత్య చేసిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.రాంబాబు ఆదివారం తెలిపారు. రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన పెరవలి మణికంఠ(27) ఈ నెల 13న హత్యకు గురైన విషయం విదితమే. ఘటనలో నిందితులైన వారిని అరెస్ట్ చేసిన అనంతరం రూరల్ సీఐ ఎం.రాంబాబు వివరాలు వెల్లడించారు. సుమారు ఏడాదిన్నర క్రితం విప్పర్ల గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బీ అనే వృద్ధురాలిపై మృతుడు మణికంఠ అత్యాచారానికి పాల్పడి హత్య చేశాడు. దీంతో వృద్ధురాలి కుమారుడు షేక్ మహ్మద్ రఫీ మణికంఠపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల13న మృతుడు మణికంఠ స్వగ్రామమైన విప్పర్లకు వచ్చాడు. అదే రోజు రాత్రి ఒంటరిగా చల్లగుండ్లలోని రోడ్డు పక్కన గల దివ్య హోటల్‌లోకి వెళ్లడం గమనించిన మహ్మద్ రఫీ మరో నలుగురితో కలసి మూడు ద్విచక్ర వాహనాలపై అనుసరించారు. రాత్రి 9-20 గంటల సమయంలో హోటల్‌లో గదిలో ఉన్న మణికంఠపై ఐదుగురు కలసి గొడ్డళ్లు, కత్తులతో దాడి చేసి చంపారు. అనంతరం ఆయుధాలతో ద్విచక్ర వాహనాలపై పరారయ్యారు. మృతుని తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. విచారణలో విప్పర్ల గ్రామానికే చెందిన షేక్ మహ్మద్ రఫీ, షేక్ కరిముల్లా, షేక్ మదార్‌వలి, షేక్ షాజహాన్, షేక్ జానీ బాషాలను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నాలుగు రోజుల వ్యవధిలోనే కేసును ఛేదించడంలో కృషి చేసిన ఎస్ఐ పి.రాంబాబు, సిబ్బందిని సీఐ అభినందించారు.

ప్రాణం తీసిన అతివేగం

ప్రత్తిపాడు: అతివేగం నిండు ప్రాణాన్ని బలితీసుకున్న ఘటన జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా కనిగిరి మండలం కృష్ణారెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ సుల్తాన్ బాషా (26) అదే ప్రాంతానికి చెందిన కేఎస్ఆర్ బాయిలర్స్ నందు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి (తెల్లవారితే ఆదివారం) సమయంలో కృష్ణా జిల్లా నందిగామ నుంచి లారీలో కోళ్ల లోడ్ చేసుకొని నెల్లూరు వైపు బయలుదేరాడు. రాత్రి ఒకటిన్నర గంట సమయంలో ప్రత్తిపాడు మండలం నడింపాలెం సమీపంలో అదే మార్గంలో ముందు వెళుతున్న తమిళనాడుకి చెందిన అశోక్ లేలాండ్ లారీ డ్రైవరు అజాగ్రత్తగా నడుపుతూ, సిగ్నల్ వేయకుండా ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేశాడు. దీంతో కోళ్లలోడు లారీ ముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందుభాగం నుజ్జునుజ్జయ్యి డ్రైవర్ సుల్తాన్ బాషాకు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తండ్రి నాగూర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. వాస్తవానికి మృతునిది సికింద్రాబాద్ సమీపంలోని వారాసిగూడ అయినప్పటికీ కొన్ని సంవత్సరాల కిందటే నెల్లూరులో స్థిరపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని ప్రమాదానికి గురైన లారీ నుంచి బయటకు తీసేందుకు పోలీసులు, హైవే అంబులెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.